# రక్తాక్షి

కొల్లమూరి శేషగిరిరావ్




'అబ్బ! ఎంత బాగుందిరా ఆ బొమ్మ! ఎవరు గీసారో కాని, జీవకళ ఉట్టిపడుతూ, ఎంతో ఆకర్షణీయంగా ఉంది' అన్నాడు రామానందం.

నాకు బోల్డు నవ్వు వచ్చింది, అతని మాటలు వింటూంటే.

'సరి, సరి ఆ బొమ్మకి జీవకళ కూడానా? ఎవడో ఆడభయం ఉన్నవాడు ఊహించి రాసిన పచ్చి శృంగారం, గీసిన అర్ధనగ్నదేహం, బొమ్మకోసం కొన్నానేమిటి? ఆ బరువైన, అందంగా నగిషీలు చెక్కిన ఫ్రేముకోసం కొన్నానంతే' అంటూ తేలిగ్గా ఈసడించి పారేశాడు బ్రహ్మజీ.

పచ్చి అబద్ధం ఆ సంగతి నాకు తెలుసు. లీలగా ఒళ్లంతా కనిపిస్తున్న ఆ అర్ధనగ్న ఊహా సుందరిని తలచుకుంటూ, ఎన్ని కలల అలల్లో కొట్టుకు పోలేదూ ఈ ప్రబుద్ధుడు?

'అబ్బే, అలా తీసి పారేయకురా! ఎవరు, ఎలా ఊహించితే ఏం గాని, ఆ బొమ్మలో నిజంగా జీవకళ ఉట్టిపడుతూంది. అవయవాల సొంపుల్లో అయితే ఏం, మెరుపుల్లో అయితేనేం, ఎంతో ఆహ్లాద జనితంగా ఉంది. ముఖ్యంగా ఆ కళ్ళు చిత్రీకరించిన విధానం చూడు. ఆ యువతి శృంగార జనితంగా కూర్చున్నట్లే, ఆమె కళ్లలో కాంక్షా పూరితమైన ఎర్రని జీర ఎలా ప్రకాశిస్తూందో!'

కళా ప్రపూర్ణమైన రామానందం హృదయానికి బొమ్మలోని విశేషాలే కానవచ్చాయి.

'కట్టిపెట్టవోయ్ నీ కవిత్వం. ఆ కళ్లు కాంక్షా పూరితంగానూ లేవు. కాంక్షా జనితంగానూ లేవు. త్రాగి వచ్చినట్లు, కోపంతో బుసలు కొడుతున్నట్లు, నెత్తురుబట్టి ఎర్రగా ఉన్నాయి అంతే. అందుకే ఈ మహాతల్లికి రక్తాక్షి అని పేరుపెట్టాన్నేను. ఇంక ఆ ఫోటోని ఊరికే పొగడక వచ్చిన పనిగురించి ఆలోచించడం మొదలుపెట్టు.' అని గసిరాడు బ్రహ్మజీ.

'ఛీ, కళని ఆస్వాదించలేని పశుప్రాయుడు' అని నాలో నేనే కృంగిపోయాను.

బ్రహ్మజీ మాటలకి ఒక్కసారిగా కళాప్రపంచం లోంచి కుళ్ళు ప్రపంచంలోకి వచ్చిపడ్డాడు రామానందం.

'ఒరేయ్ బ్రహ్మజీ, నా సంగతి నీకు తెలియనిది ఏముంది? రెక్కలమీదేకదా నేను పూర్తిగా ఆధారపడేది. వెనక ఇంకేమీలేదు. గత ఆరునెలలనించి చచ్చి చెడి ఓ వెయ్యి రూపాయలు పోగేసాను. అవి ఇప్పుడు చెల్లిస్తాను. అలాగే ప్రతి ఆరునెలలకి వెయ్యి, వెయ్యి చొప్పున నీ బాకీఅంతా తీర్చుకుంటాను. నా బాల్య

మిత్రుడివి, ప్రాణమిత్రుడివి కదా అనే ధైర్యంతోనే, నీదగ్గర అప్పు తీసుకుని ఇంత సాహసం చేశాను. మాకున్న ఒక్క ఆధారాన్నీ పడగొట్టకుండా, నేను చెప్పినట్టు ఒప్పుకోరా' ఇవి చేతులుకావు కాళ్ళు అనుకోరా ప్లీజ్.'

అతి దైన్య వచనంతో, శిలావతారమై కూర్చున్న బ్రహ్మాజీ చేతులు పట్టుకొని ప్రాధేయ పడుతున్న రామానందాన్ని చూస్తుంటె నాకడుపు తరుక్కుపోయింది.

'హు! నేర్చావులే చాలావేషాలు. ఇప్పుడొచ్చిందా మన బాల్యమిత్రత్వం జ్ఞాపకానికి? డబ్బు ఎంత పాపిష్టిదో నీకు తెలియదా? ప్రాణమిత్రుల్ని సైతం బద్ధ శత్రువుల్ని చేస్తుందన్నసంగతి అప్పు అడిగిననాడు మర్చిపోయావా? సాహసంట, సాహసం. కామాంధకారంలో కళ్ళు కప్పుకుపోయాయిరా నీకు. అందుకే, ఎంతో మంచివాణ్ణే అనిపించుకుందామని, అందాల చిలకని చేతిలో చిక్కించుకుందామని, నా దగ్గిర్నించి పదివేల రూపాయలు అడుక్కొని తీసుకుపోయి, గుప్పించి ఆ జలజని నీదాన్ని చేసుకున్నావు. ఒకటా, రెండా? పదివేల రూపాయలు, వడ్డీ చేరిస్తే పన్నెండువేలు. నువ్వు ఏడాదికి రెండువేలు, అదైనా చచ్చీ చెడి పోగేసి, ఇవ్వగలిగితే, చొప్పున తీరుస్తావా? అంటే ఇంకో ఆరేళ్ళపాటు ఈపాట సాగాలా? నేను ఇన్నాళ్ళూ గాజులు తొడిగించుకుని కూర్చోవాలా? అబ్బో, ఏం సరసంగా మాట్లాడుతున్నావురా, రామానందం' అలాంటి పప్పులేవీ నా దగ్గర ఉడకవురోయ్. తీర్చదల్చుకుంటే వెంటనే తీర్చు. లేకపోతే నీకున్న ఆ ఒక్క ఇంటినీ వెంటనే వేలం వేయించాల్సి ఉంటుంది. నువ్వూ, నీ అందాలభార్యా రోడ్లపాలైపోతారు. నాకే చింతాలేదు, మధ్య వచ్చేది మీకే, ఇదే నా నిర్ణయం.'

'ఎంత నిర్దయగా, నిష్కర్షగా మాట్లాడావు బ్రహ్మాజీ' అనుకుంటూ ఆశ్చర్యపోయాన్నేను.

లబ్బు కూడబెట్టిన గంపెడు డబ్బు మూలుగుతోంది బ్రహ్మాజీకి, ఇనప్పెట్టెలో. బ్రహ్మాండమైన ఆస్తి ఉంది. పదివేల రూపాయలు, పది చిల్లిగవ్వలో కూడా లెక్కకాదు అతనికి. ఇప్పటికిప్పుడు ఊపుకుంటూ, పంచరంగుల రామచిలక ఒకటి అతనిపక్కలోకి వస్తానంటె, పందలకు పందలు ధారాప్రవాహంగా ధార పోస్తాడు. అంతవరకూ ఎందుకు. సంగతి చెప్పకుండా రామానందం పదివేల రూపాయలు అప్పు అడిగిననాడు, మారుమాట్లాడకుండా సొమ్ము చేతిలో పెడ్తూ 'ఒరేయ్, నువ్వు నా ప్రాణస్నేహితుడవి. ఈ డబ్బు నాకు తిరిగి ఇవ్వడం గురించి బెంగపెట్టుకోకు, నామట్టుకు నేను దానం చేశాననుకుంటాను. నీమట్టుకు నీవు వీలునిబట్టి తీర్చుకోవచ్చు' అని అత్యుత్తముడిలా కబుర్లు చెప్పాడు నాకళ్ళముందే అలాంటివి. ఇంతట్లో ఎంత పాషండుడిలా మారిపోయాడు!

బ్రహ్మాజీ, రామానందం, వీధిబడి వయస్సునుండీ కలిసి చదువుకున్నారు. ఆర్థిక స్తోమతలో తేడావున్నా చిన్నప్పటినుంచీ వచ్చిన స్నేహమేమో. ఆ భేదం వాళ్ళ మిత్రత్వానికి ఏనాడు అడ్డు నిలవలేదు. గుణాల్లోకూడా వాళ్ళిద్దరికీ మధ్య హస్తిమశకాంతరం ఉంది. రామానందం సహజంగా బుద్ధిమంతుడు. మంచి సంస్కారవంతుడు. బ్రహ్మాజీ చిన్నప్పట్నించీ జులాయివాడే. దానికి తోడు, రెండు చేతులతోను ఖర్చుపెట్టడానికి, డబ్బుకి కొదవేమీలేదేమో, వయసు వచ్చినకొద్దీ దురలవాట్లకీ, చెడ్డతిరుగుళ్ళకి అలవాటుపడిపోయాడు. కాని ఇన్నాళ్ళదాకా వాటిప్రభావం అతని సహజన్మైజంమీద ముద్ర వేసిన సంగతి నాకు తెలియదు.

జలజ మంచి సాంప్రదాయం గల కుటుంబంలో పుట్టిన పిల్ల. కాని చిన్నప్పుడే తల్లిని కోల్పోయింది. జలజ తండ్రి తిరిగి వివాహం చేసుకోలేదు కాని దురదృష్టవశాత్తు చెడ్డ స్నేహాలకు, అలవాట్లకు ఆహుతైపోయాడు. పేకాటకి, త్రాగుడుకి పూర్తిగా లొంగిపోయి ఉన్న ఆస్తంతా కర్పూరంలా హరింపచేసి అప్పులపాలైపోయాడు. తను వేళతప్పి ఇంటికి వచ్చినప్పుడు తిండి పెట్టే పనిపిల్లలాగా ప్రేమే చూసేవాడు జలజని. అంతేగాని, ఆమె తన కూతురని, ఆమెకు పెళ్లి చేసి ఒక యింటిదాన్నిగా తీర్చిదిద్దవలసిన బాధ్యత తనకున్న సంగతే మర్చిపోయాడు ఆ మహానుభావుడు.

లతలే మెరుపుతీగెలా ఉండే జలజ — వయసు వస్తున్నకొద్దీ మానవాకారం దాల్చిన జలదేవతలా రూపు దిద్దుకుంది. 'ఈమె జలజ కాదు. అసలు సిసలయిన పంకజం. రాళ్ళలోని రత్నం' అనుకొనేవారంతా ఆమెను చూసి.

రోజులన్నీ ఒక్కలాగే గడుస్తాయా? చివరికి జలజ తండ్రి పాపం బద్దలైంది. అప్పటికప్పుడు డబ్బు కక్కడమో, లేక ఉన్న ఒక ఇంటిని వదులుకొని శ్రీకృష్ణజన్మస్థానం అలంకరించడమో తప్ప ఇంకొక గత్యంతరంలేని పరిస్థితివచ్చింది. సమయం మించిపోయాక కళ్ళు తెరిచి ప్రయోజనం ఏముంది? చివరికి చేసేదేమీ లేక, తనకి చిన్నప్పటి నించీ తెలిసిన బ్రహ్మాజీని శరణుకోరా డాయన. బ్రహ్మాజీకి అంతకుముందే జలజ తెలుసు. ఆమెని చూస్తూ ఎన్నోసార్లు సోహాగించుకున్నాడు కూడా. అందుకని వచ్చిన ఈ అవకాశాన్ని జారవిడుచుకోదల్చుకోలేదు బ్రహ్మాజీ.

'అయ్యో పాపం, మీ కింత కష్టం వస్తే నా కొచ్చినట్టు కాదటండీ. నో తప్పకుండా డబ్బు సర్దుతాను. రాత్రికి జలజని పంపించండి, ఆమె చేతి కిచ్చి డబ్బు పంపిస్తాను' అన్నాడు చాలా నిర్లిప్తంగా బ్రహ్మాజీ.

కొరడా ఝళిపించినట్లయింది జలజ తండ్రికి. ముందు నోట మాట రాక తెల్లబోయాడాయన. చివరికి యెలాగో నిల్దొక్కుకుని 'అయ్యో నాయనా, నీకు మా జలజమీద మనసు ఉన్నట్టు ఇన్నాళ్ళూ తెలియనే లేదే! దానికేముంది నువ్వు సై అంటే వెంటనే మీ యిద్దరికీ ముడి పెట్టేస్తాను' అన్నాడాయన.

ఒక్కసారి తోక తొక్కిన తాచులా లేచాడు బ్రహ్మాజీ. 'చిల్లిగవ్వ కూడా చెయ్యని త్రాగుబోతువాడివి. సాంప్రదాయహీనుడివి. నీ కూతుర్ని నేను పెళ్లిచేసుకుంటానని ఎలా అనుకున్నావ్? ఏదో కష్టంలో ఉన్నావ్ కదా, ఊరికే పోకుండా ఏదో చిన్న ప్రత్యుపకారం తీసుకుని నీకీ సాయం చేద్దామనుకున్నాను. న్యాయంమీది

పోతున్నావ్ ! చనువిచ్చాను కదా అని, నక్క ఎక్కడ, నాగలోకం యెక్కడ ? 'గెటవుట్!' అని గర్జించాడు బ్రహ్మజీ.

జలజని పెళ్లి చేసుకొని జీవితాంతం తనదాన్ని చేసుకోడానికి ఆమె తండ్రి యొక్క త్రాగుబోతుతనం, పేదరికం అడ్డు వచ్చాయట బ్రహ్మజీకి. కాని ఒక రాత్రి ఆమెను అనుభవించడానికి అది అడ్డుకాదు కాబోలు! ఆహా! ఏమి మానవ సమాజం !

అసలే సంఘంలో దిగజారిన జలజ తండ్రికి ఏమీ పాలుపోలేదు. చివరికి బ్రహ్మజీతో ఒప్పందం చేసుకొని బరువుగా ఇల్లు చేరి, చల్లని వార్త జలజ చెవిలో వేసారాయన. అసలే లోటు జీవితం భారంగా గడుపుతున్న జలజ చెవుల్లో ములుకుల్లా, ఇనుముక్కెల్లా గుచ్చుకున్నాయి ఆ మాటలు. ఆమె హృదయమంతా పెనుతుఫాను కార్చిచ్చుల్లా అలుముకుపోయింది. ఆమెకు, తన శీలాన్ని బలి ఇవ్వడానికైనా వెనుదీయని తన తండ్రినీ, తన మానాన్ని బలిగొనడానికి సాహసించిన బ్రహ్మజీనీ కూడా ఏమాత్రం తృప్తి పరచడం ఇష్టం లేకపోయింది. అబల, ఏమి చెయ్యగలదు, ఏ నుయ్యో గొయ్యో చూసుకోవడం తప్ప? చివరికి ఆ నిర్ణయానికే వచ్చిందామె.

రాత్రి ఎనిమిది గంటలకు, యెవరికీ తెలియకుండా మానానికి బదులు తన జీవితాన్ని బలి ఇవ్వడానికి కాలువకేసి పరుగెత్తుకు వెళ్లింది జలజ. దైవవశాత్తూ పక్క వూరికి చుట్టాల్ని చూడడానికి వెళ్లి తిరిగి వస్తున్న రామానందానికి కాలవ ఒడ్డున, భగవంతునికి నమస్కారం చేసి లోపలకు దూకబోతున్న జలజ కనిపించింది. ఒక్క ఉదటున వెళ్లి ఆమెను వాటేసుకుని రక్షించాడు రామానందం. కళ్లల్లో వెల్లువలై నీరు పారగా తన జాలిగాధను వివరించింది. జలజ, రామానందంతో. అప్పటికప్పుడే ఆమెను తనదాన్ని చేసుకోడానికి, ఆమె తండ్రిని చిక్కుల్లోంచి బయటకు తీయడానికి నిర్ణయించుకున్నాడు రామానందం కాని, అప్పటికి అతనికింకా తన మిత్రుడు బ్రహ్మజీయే, ఆమె మానాన్ని పణంగా తీసుకుని ఆమె తండ్రిని రక్షించ దల్చుకొన్న ప్రబుద్ధుడని తెలియదు.

[illegible]

# రక్తాక్షి

కుంది జలజ. జరిగినదంతా తన తండ్రికి తెలియబర్చింది. ఆయన ఆనందానికి మేరేలేదు. రామానందం చేసిన నిర్ణయ ప్రకారం ఇంకో రెండు మూడు రోజుల దాకా ఈ విషయాన్ని రహస్యంగానే ఉంచడంకోసం, ఆయన మర్నాడు ప్రొద్దున్నే బ్రహ్మజీ దగ్గరకు వెళ్లి, క్రితం రాత్రి జలజను అతనివద్దకు పంపడానికి ఏది అడ్డు పడిందని, ఇంకో మూడు నాలుగు రోజుల తర్వాత తప్పకుండా పంపిస్తాననీ, అంతవరకు తన పలుకుబడిని ఉపయోగించి తనమీద ఏ చర్యారాకుండా కాపాడమనీ ప్రాధేయపడ్డాడు. సరేనని ఒప్పుకున్నాడు బ్రహ్మజీ, ఆనందంతో నాలుగు రోజుల ప్లాను వేసుకుంటూ.

ఆనాడు మధ్యాహ్నమే రామానందం తన ప్రాణమిత్రుడైన బ్రహ్మజీ వద్దకు సహాయార్థం వచ్చాడు. అతనుకూడా తమ నిర్ణయం ప్రకారం అసలు సంగతి దాచి ఇంకో అవసరమేదో ఉన్నట్లు చెప్పాడు బ్రహ్మజీకి. అందువల్ల మారుమాటాడకుండా బ్రహ్మజీ తన మిత్రుడికి అడిగిందంతా ఇచ్చేసాడు. ఆ డబ్బుతోనూ, జలజా వాళ్లఇంటితోనూ, జలజా తండ్రి యొక్క అప్పులన్నీ తీర్చివేసి, ఆమెను నిరాడంబరంగా వివాహం చేసుకొని వాళ్లని తనఇంటికి తీసుకుపోయాడు రామానందం.

ఇదంతా తర్వాత తెలిసి, అగ్గిపిడుగై పోయాడు బ్రహ్మజీ. వాళ్లంతా, రామానందంతోసహా, కలిసి, కూడబలుక్కుని తనని మోసం చేసారనీ, తన నోటిముందు కూడు పడగొట్టారనీ మండిపోయాడు, తను ఏ దుర్మార్గుని బారినుండి జలజని రక్షించాడో, అతడు తనకి సహాయంచేసిన తనమిత్రుడు బ్రహ్మజీయే అని తెలిసిన రామానందం అప్రతిభుడై పోయాడు. ఇదంతా విధి ప్రేరితం కాబోలు!

ఒక్కసారి గతంలోంచి వర్తమానంలోకి మేలుకున్నాడు. రామానందం ఇంకా ప్రాధేయపడుతూనే ఉన్నాడు. బ్రహ్మజీతో తనని సర్వనాశనం చెయ్యవద్దని.

ఒకసారి వికటంగా నవ్వాడు బ్రహ్మజీ. 'ఊఁ నాతో అనవసరంగా బీదకూతలు కూయబోకురా. ఈ వెయ్యిరూపాయలు ఏమూలకి? నీ దగ్గర ఉంచుకో. రేపు ప్రొద్దుటిలోగా [illegible] తీసుకుంటావో

లేక సర్వనాశనం అవుతావో నీ ఇష్టం' నిక్కచ్చిగా చెప్పేసాడు బ్రహ్మజీ.

'అలా అంటె ఎలారా? ఏదో ఉపాయం ఆలోచించు. కనీసం ఒక్కనెల గడువియ్యి. తెలిసిన వాళ్లందరివద్దా కడుపు చేతిలో పెట్టుకుని అడుక్కుని నీ అప్పు ఎలాగో తీర్చుకుంటాను' అని వాపోయాడు రామానందం.

'అదేం వీలులేదు ఈ సంగతి రేపటిలోగా తేలి తీరాల్సిందే. ఒక్క గంట కూడా గడువిచ్చేది లేదు. అంతగా బతిమాలుతున్నావు కాబట్టి, ఎంత లేదన్నా బాల్య మిత్రుడవి కాబట్టి, ఏదో ఉపాయం ఆలోచించమన్నావుకదా అని చెబుతున్నా. ఈ వెయ్యి రూపాయలతోనూ జలజని రాత్రికి ఇక్కడికి పంపించు. ఇదే పదివేల రూపాయలుగా జమకట్టి నీనోటు చెల్లు పెట్టేస్తా. ఇదే నాకడ ఉపాయం. ఇక తిరుగులేదు. వెళ్లు' అని గదమాయించి లేచి పెద్ద పెద్ద అంగలతో గదిలోంచి బయటకు వెళ్లిపోయాడు బ్రహ్మజీ, 'వీరయ్యా, ఆ గదిలోని రామానందాన్ని సాగనంపు' అని అరుచుకుంటూ.

మిన్ను విరిగి పడ్డట్టు స్తాణువై పోయాడు రామానందం. 'ఎంత నీచత్వానికి దిగజారావు బ్రహ్మజీ' అనుకుంటూ పళ్లు పటపట లాడించి కోపంతో ఊగిపోయాన్నేను. భరించలేని బాధతో, కోపంతో నిస్తబ్ధుడై పోయిన రామానందాన్ని నౌకరు వీరయ్య తోలుకుపోయాడు.

మృత్యుదేవత కౌగిలిలా, చల్లగా, నల్లగా ప్రవేశించింది కాళరాత్రి. తెల్లని మల్లు పంచె, లాల్చీవేసుకుని, అత్తరు వాసనలు ఘుమాయిస్తూ, కారాకిళ్లీ నములుతూ, సిగరెట్టుపొగలురింగురింగులుగావదులుతూ, అయోమయంగా పచార్లు చేస్తున్నాడు బ్రహ్మజీ. బ్రహ్మాస్త్రం విసిరాడు. ఏమవుతుందోనని ఫలితంకోసం ఎదురు చూస్తున్నాడు. రామానందం మనసు ఎలా బాధపడుతూందో, జలజహృదయం ఎలా జలదరించి పోతోందో తనకు అనవసరం. క్రిందటిసారిలాగే ఆత్మహత్యా ప్రయత్నం చేసుకుంటుందా. పీడావదిలింది. ఏమీ చెయ్యకుండా ఊరికే ఉంటారా, రేపటిన్నుంచీ దిక్కులేని పక్షులే, సర్వనాశనమే. అలాకాక జలజని తనవద్దకు పంపిపోదా—అబ్బ, ఎంతఅదృష్టం! ఎవారు_

చేస్తూనే సుఖదుఃఖ స్వప్నాల్లో మునిగ పోతున్నాడు బ్రహ్మజీ.

'ఆమె ఎవరో వచ్చారండి' అంటూ హార్తా చేరవేసాడు వీరయ్య.

ఉలిక్కిపడ్డాడు బ్రహ్మజీ. ఉలిక్కిపడ్డాను నేను.

అడుగులో అడుగులేసుకుంటూ, భీత హరిణేక్షణాలతో చుట్టూ చూసుకుంటూ భూలోకానికి దిగిన అప్సరసలా ముందుకి వచ్చింది జలజ.

'ఇదిగో వచ్చాను. ఇదిగో వెయ్యి రూపాయలు' అని కుర్చీలో కూర్చుంది జలజ.

'చాలా తెలివైన పనిచేసావు. నిన్ను, రామానందాన్ని, నన్ను అందర్నీ రక్షించావు' అని కామాతురమైన ఎర్రని కళ్లతో ఆమె అందాన్ని త్రాగివేస్తూ తలుపుకేసి నడిచాడు బ్రహ్మజీ.

'ఆగండి' అంటూ విలాసంగ పైట దిగజార్చి అతనికేసి నవ్వుతూ నడిచింది జలజ.

'మీ నమ్మకం నాకేమిటి? నన్ను తీరా దోచుకున్నాక నోటు చెల్లుపెట్టక పోతే మాగతేంకాను? నేనెలాగో మీకు వంటింట్లో కుందేలునేకదా. ఎక్కడికీ పోను. ముందు నోటు చెల్లుపెట్టండి. తర్వాతే మీకునాపొందు' అంది జలజ, వయారాలు వలకపోస్తూ.

'ఓస్ అంతకన్నానా? అసలు ఈ వెయ్యి కూడా అఖ్ఖర్లేదు. నువ్వేతీసుకో. ఇదిగో నోటు చెల్లుపెట్టేస్తా' అంటూ ఆనందంతో తేలిపోతూ ఇనప్పెట్టె తెరిచి, నోటు తీసుకు వచ్చాడు బ్రహ్మజీ.

'ఇదిగో చూసుకో. నీచేత్తో నువ్వే చింపిపారెయ్యి' అన్నాడామెతో.

జలజ ఆనోటుని జాగ్రత్తగా పరీక్షించి పరపరా చింపి పారేసింది.

మరుక్షణంలో ఆ సౌందర్యదేవత, భీషణ మృత్యుదేవతగా మారిపోయింది. సీర మడతల్లోంచి రివాల్వర్ తీసి బ్రహ్మజీకేసి గురిపెట్టింది.

'దుర్మార్గుడా. నీలాంటి వాగికిదే మంత్రం. అపాయంలోంచి ఉపాయం వల్లే తప్పించుకోవాలి. ఇది బొమ్మ రివాల్వర్ అనుకోకు. ముందు అడ్డు తప్పుకో. ఏమాత్రం కదిలినా జాలిమాప కుండా కాల్చి పారేస్తా' అని ఆడపులిలా గాండ్రించింది జలజ. ఎనలేని సంతోషంతో నామనసు ఊగిసలాడింది ఆమె వెర్పుకి.

అనుకోని ఈ హఠాత్ పరిణామానికి మ్రాన్పడిపోయాడు బ్రహ్మజీ. చేసేదిలేక ఆమెకు దారివదిలాడు.

చెంగున లేడిపిల్లలా తలుపుతీసి పరుగు తీసింది జలజ. కాని, మనిషి ఒకటి తలిస్తే, భగవంతుడు ఇంకొకటి తలుస్తాడు కాబోలు. ఎంతో ప్రశాంత చెందిన వాతావరణం మరుక్షణంలో మళ్లీ ప్రళయావతారం దాల్చింది. పులినోటినుండి తప్పించుకుని పారిపోవామన్న కంగారులో జలజ కాలిబొటనవేలు, నేలమీద పరచిన తివాసీ త్రాడులో చిక్కుకుని ఆమె 'అమ్మో' అంటూ నేలమీద పడిపోయింది. చేతిలోని తుపాకి అల్లంత దూరంలో పోయిపడింది. భగవంతుడిచ్చిన ఈ అవకాశాన్ని వదులుకోలేదు బ్రహ్మజీ. కళ్లు బైర్లుకమ్మి లేవబోతున్న జలజను తన పశుబలంతో చుట్టుముట్టాడు.

వేసుకున్న ఉపాయం మట్టిపాలవ్వగా చేసేదిలేక, లేనిబలంకూడ గట్టుకొని తన శీలంకోసం బ్రహ్మరాక్షసిలా బ్రహ్మజీతో తలబడింది జలజ. గోళ్లతో రక్కుతోంది. కాళ్ళతో తంతోంది. పళ్లతో కరుస్తోంది కాని దున్నపోతులాంటి ఆ మానవుడిమీద వాటి ప్రత్యక్షశక్తిగాని, పరోక్ష శక్తిగాని ఏ మాత్రం ఫలితం చూపించలేక పోతున్నాయి.

ఎదురుగా జరగబోతున్న ఘోరమైన మానభంగానికి నా హృదయమంతా కంపించిపోతోంది. కాని ఏంచెయ్యగలను? ఆ అబలని ఎలా రక్షించగలను? ఓ భగవంతుడా ఆ శక్తిని నాకియ్యి అని ఆక్రోశించాన్నేను, వృధాకోపంతో ఎర్రగా చూస్తున్నాను.

బ్రహ్మజీ చేతులు జలజదేహమంతా నృత్యం చేస్తున్నాయి. కాని ఆమె ఇంకా వివస్త్రకాలేదు. లేని శక్తితో పోరాడుతోంది. ఇద్దరూ నుంచునే ఉన్నారు. ఆమెను ఎలాగైనా సోఫామీదకు తోసి ఆక్రమించుకుందామని చూస్తున్నాడు బ్రహ్మజీ. ఆమె నెలాగైనా వివస్త్రను చెయ్యాలని చూస్తున్నాయి అతనిచేతులు. ఆ సమయంలో లేని బలమంతా కూడ గట్టుకుని ఒక్కసారి గట్టిగా తోసింది జలజ బ్రహ్మజీని. ఆ ఊపుతో ఆమె రవికను అంది పుచ్చుకున్న అతని రెండు చేతులూ, ఆమె రవికను చింపుకుంటూ ఊడిపోయాయి. అతను వెనక్కు కూలిపోయి, నా క్రిందుగా గోడకు తగిలాడు. ఇదే సమయంకోసం ఎదురు చూస్తున్న నేను ఒక్కదూకుతో నామేకుని ఊడదీసుకుని అతని తలమీద గట్టిగా పడ్డాను నెత్తురు చిందిస్తూ. మరుక్షణంలో జలజ ఆ గదిలోంచి పారిపోయింది.

కొన ఊపిరితో నా ముఖంలోకి తేరిపారి చూసాడు బ్రహ్మజీ.

'ర ... క్త ... క్షి' అంటూ కన్ను మూసాడు. ●

